క్లుప్తంగా

మా గ్రామాన్ని కాపాడండి



నిరసన తెలుపుతున్న బసవయ్యపాళెం రైతులు, గ్రామస్తులు

శ్రీకాళహస్తి: రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి తమ గ్రామాన్ని కాపాడాలని బసవయ్యపాళెం గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులో సిమెంటు పైపులతో రోడ్డుకు అడ్డంగా నిర్మాణం చేపట్టారన్నారు. తాము పలుమార్లు అడ్డుకున్నామని చెప్పారు. అయినా రాత్రికి రాత్రే రియల్ ఎస్టేట్ వ్యాపారులు పైపులు వేసి నిర్మాణం చేపట్టారన్నారు. దీంతో వర్షాకాలంలో తమ గ్రామం మునిగిపోయే ప్రమాదముందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని తమ గ్రామాన్ని కాపాడాలని వారు కోరారు.

బాధ్యతల స్వీకరణ

నాగలాపురం: పిచ్చాటూరు మండల మహిళా సమాఖ్య ఏపీఎంగా ఎస్.చంద్రకళ, సీసీలుగా సుబ్రమణ్యం, నాగేంద్ర కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఏపీఎం వనిత పుత్తూరు రూరల్‌కు, క్లస్టర్ సీసీ పరశురాం విజయపురానికి, సీసీ ఉష కార్వేటినగరానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సంఘాల నగదు రహిత లావాదేవీలపై పూర్తి దృష్టి సారించాలన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా నింద్ర మండలం నుంచి బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

మొక్కలు నాటాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కేశవులు

ఏర్పేడు: ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలని సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశవులు అన్నారు. శుక్రవారం మండలంలోని పెనుమల్లం ప్రాథమిక పాఠశాలలో మొక్కల ఆవశ్యకతపై అవగాహన, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని సూచించారు. కార్యక్రమంలో సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ ప్రతినిధులు ఢిల్లీ, హరిబాబు, ఉపాధ్యాయులు బాలాజీ, జగన్నాథం, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

గ్రామసభల్లో అభివృద్ధికి ప్రతిపాదనలు



మాట్లాడుతున్న కార్యదర్శి నాగరత్నమ్మ

నాగలాపురం: గ్రామ సభల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందిస్తామని పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ అన్నారు. మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ చిన్నదొరై సుధ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ పర్యవేక్షణలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ మాట్లాడుతూ గ్రామసభల్లో గ్రామాల అభివృద్ధికి అవసమైన ప్రతిపాదనలను రూపొందిస్తామన్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజీలు, కల్వర్టులు, గ్రావెల్, తారు రోడ్డు నిర్మాణం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, చెరువులు కుంటలు పూడికతీత పనులు, పశువులు షెడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి గ్రామసభల్లో తీర్మానం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత, నాయకులు శ్రీనివాస యాదవ్, శేషాద్రి, సునీల్ కుమార్, ప్రణీత్ రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్క నాటుతున్న ప్రిన్సిపల్, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి ఇంటి వద్ద ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రిన్సిపల్ ధర్మేంద్రకుమార్ సింగ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో ఆయన సిబ్బందితో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లు లేకపోవడంతోనే వర్షాలు కురవడం లేదని, వేడి ఎక్కువ ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెట్లను పెంచాలని కోరారు. అనంతరం డ్రాయింగ్, వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గోపాల్‌లక్ష్మీ పాల్గొన్నారు.

తిరుచ్చిపై సిరుల తల్లి

చంద్రగిరి(తిరుచానూరు) : శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అభిషేక సేవ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు.

పుస్తకం.. స్వస్తి వాచకం





పాత పుస్తకాలతోనే విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

అంగన్‌వాడీ కేంద్రాలు పునఃప్రారంభమై నాలుగు నెలలు గడిచింది. కానీ చిన్నారుల చేతులు వెలవెలబోతున్నాయి. పాఠ్యపుస్తకాలు లేకుండా ఉత్తి చేతులతో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఎన్నో ఆశలు..ఆకాంక్షలతో తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిన తల్లిదండ్రులకు నిరాశే ఎదురవుతోంది. పుస్తకాలు, కిట్లు అందక చదువులు సందిగ్ధంలో పడ్డాయి.

- ప్రీస్కూళ్లకు అందని పుస్తకాలు, కిట్లు
- మంజూరు చేయని ప్రభుత్వం
- పాత పుస్తకాలతోనే నెట్టుకొస్తున్న కార్యకర్తలు
- విద్యాబోధనకు ఇబ్బందులు

వరదయ్యపాళెం: పేద, మధ్య తరగతి పిల్లలు నష్టపోకూడదని ప్రైవేటు బడుల్లోని ఎల్‌కేజీ, యూకేజీ తరహాలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూల్‌గా మార్చుతూ గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం బాల్య దశలోనే పిల్లలకు గట్టి పునాదులు వేసే అంగన్‌వాడీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు మూటగట్టుకుంటోంది. పాఠశాలలు ప్రారంభమైన నాలుగు నెలలైనా ఇంతవరకు పాఠ్య పుస్తకాల పంపిణీ చేయకపోవడమే ఇందుకు నిదర్శనం.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంస్కరణలు

బాల్యంలోనే చిన్నారులు విజ్ఞానంతోపాటు ఇంగ్లిషుపై పట్టు సాధించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యనందించేందుకు పుస్తకాలను పంపిణీ చేసింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విధానానికి మంగళం పాడింది. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రీస్కూల్ పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేయలేదు. దీంతో పాత పుస్తకాలు, కిట్లతోనే అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యా బోధనను కొనసాగిస్తున్నారు.

సత్యవేడు డివిజన్‌లో 179 అంగన్‌వాడీ కేంద్రాలు

సత్యవేడు ఐసీడీఎస్ డివిజన్ పరిధిలో 179 అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,100 మంది పిల్లలు ఉన్నారు. డివిజన్ పరిధిలో మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 5,100 మంది అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు. వీరందరికీ కేంద్రాల్లో కథలు చెప్పడం, సృజనాత్మక క్రియలు, యాక్షన్ పాటలను వివరిస్తారు. ఇందుకోసం పుస్తకాలు, బొమ్మల కిట్లు అందజేస్తారు. అయితే ఈ ఏడాది ఇంతవరకూ పాఠ్య పుస్తకాలు రాలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని పాత పాఠ్యపుస్తకాలు, కిట్లతోనే అరకొరగా విద్యాబోధన కొనసాగిస్తున్నారు. పుస్తకాలు ఎలా సర్దుబాటు చేయాలో అర్థంకాక, విద్యాబోధన ఎలా కొనసాగించాలో తెలియక పలువురు అంగన్‌వాడీ కార్యకర్తు ఇబ్బందులు పడుతున్నారు.

> **పుస్తకాలు రాలేదు**
>
> అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు ప్రభుత్వం ప్రీప్రైమరీ విద్యను అందిస్తోంది. పేద, మధ్యతరగతి వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. కేంద్రంలోని ప్రతి పిల్లవాడికి పీపీ-1, పీపీ-2 కిట్లను పంపిణీ చేస్తుంది. ఈ సంవత్సరం ఇంకా రాలేదు. అధికారులు వస్తాయని చెబుతున్నారు. ఎప్పుడు వస్తాయో తెలియదు. వస్తే తప్పకుండా ప్రతి కేంద్రానికి పుస్తకాలను పంపిణీ చేసి, మెరుగైన విద్యాబోధనకు కృషి చేస్తాం. -రెడ్డి దేవకుమారి, సీడీపీఓ, సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్

ప్రైవేటు పాఠశాలలకు లబ్ధి చేకూర్చేలా..

కూటమి ప్రభుత్వం పుస్తకాలకు స్వస్తి పలికి, మళ్లీ పాత విధానానే అమల్లోకి తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ప్రీస్కూల్ ఎక్కడ చేరితే అక్కడే ఉన్న పాఠశాలలో విద్యార్థిగా కొనసాగే అవకాశం ఉంది. ఒకవేళ అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేస్తే పిల్లలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాత కూడా విద్యాబోధన ప్రైవేటు పాఠశాలల్లో కొనసాగిస్తారు. దీంతో ప్రైవేటు యాజమాన్యాలకు మేలు చేకూరుతుంది.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే కిట్ల పంపిణీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల తరహాలోనే విద్యాబోధన కొనసాగించేందుకు బర్డ్స్-1 కిట్లను అందజేసింది. నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్ యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లను, ఐదేళ్లలోపు చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను ఇచ్చారు. దీంతో పిల్లలకు విద్యాబోధన సులభంగా అర్థమయ్యే రీతిలో సాగేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎందుకంటే పాత పుస్తకాలు ఉన్నప్పటికీ కొన్ని చినిగిపోయి అస్తవ్యస్తంగా మారాయి. అందులో ఒకరికి పుస్తకం ఉంటే మరొకటి ఉండదు. దీంతో చిన్నారులకు విద్యాబోధన చేయడం కష్టంగా మారిందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంధోత్సవం ప్రారంభం



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖినది ఒడుడ్డ ఉన్న హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా జులేషా పీర్ ఖాదరవల్లి అల్లా దర్గాలో ఉరుసు గందోత్సవం ప్రారంభమైంది. ఇందులో భాగంగా శుక్రవారం దర్గా వద్ద నిషాన్ జెండా ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పాల్గొని, ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ దర్గాను సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కూడా దర్గాలో ప్రార్థనలు చేశారు.

తూతూమంత్రంగా స్వచ్ఛతాహీ సేవ

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తూతూమంత్రంగా స్వచ్ఛతా హీ సేవ సమావేశాలు జరిగాయి. పాపానాయుడుపేట, కుక్కలగుంట తదితర గ్రామాల్లో అధికారులతో నిమిత్తం లేకుండా టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పలువురు టీడీపీ నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలతో మమ అనిపించారు.

అగ్రహారం చెరువును అభివృద్ధి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని దళవాయి అగ్రహారం చెరువును అభివృద్ధి పరిచి, సమ్మర్ స్టోరేజ్ నిర్మాణం పనులు చేపట్టాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్ బాబు, బీజేపీ నాయకుడు వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం సత్యవేడు పంచాయతీలో సర్పంచ్ మంజుల అధ్యక్షతన స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ కోటమిట్ట, బీసీ, ఎస్టీ కాలనీల్లో సిమెంటురోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. పంచాయతీ పరిధిలోని నీటి ట్యాంకులు నెలకోసారైనా క్లోరినేషన్ చేసి, నాణ్యమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. సంత స్థలాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపానికి కేటాయించడంతో ప్రస్తుతం సంతకు ఏ ప్రాంతాన్ని ఎంపిక చేశారని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. కోళ్ల వ్యర్థాలను తెలుగుగంగ కాలువపై వేస్తుండడంతో ఆ మార్గంలో చదవాలమ్మ దేవాలయానికి వెళ్లి, వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పంచాయతీ పరిధిలో పశువులకు రోడ్డే బందిలి దొడ్డిగా ఉంటోందని, రోడ్డుపై పశువులు నిలిచి ఉండడంతో వాహనదారులకు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మునిరవికుమార్ మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, వార్డు సభ్యులు మహేష్, హేమభూషణం, భవానీ, మునివేలు, కోనయ్య, హరీష్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లు మంజూరు



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 44 సిమెంట్ రోడ్లుకు రూ. 2 కోట్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. మండలంలోని 28 పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మన పంచాయతీ, మన సాధికారత గ్రామసభలు నిర్వహించారు. బుచ్చినాయుడుకండ్రిగ సచివాలయం వద్ద జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047తో పనిచేస్తుందని, ప్రజలందరూ సహకరించాలని తెలిపారు. విజన్ 2047లో భాగంగా పంచాయతీలో మౌళిక సదుపాయాల గురించి చర్చించి, ప్రజా అభిప్రాయ సేకరణ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మన ఇల్లు, మన గౌరవం ఈ నెల 28వ తేదీన లేఅవుట్ల వద్దకు ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తామన్నారు. వీధిలైట్లు, పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద తయారీ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మురళిని సన్మానిస్తున్న అధికారులు

నారాయణవనం: మండలంలోని అరణ్యకండ్రిగ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి సంర్పంచ్‌గా మురళి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు సన్మానించారు. సర్పంచ్ రత్న వ్యక్తిగత కారణాలతో ఏడాది పాటు సెలవు పెట్టారు. పంచాయతీ పాలన కొనసాగడానికి ఉప సర్పంచ్ మురళికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ గురువారం ఈఓపీఆర్డీ వేణయ్య ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజన, వార్డు సభ్యులు, కైలాసనాథకోన ఆలయ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి నవరాత్రి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరాలయంలో అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 29వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారు 4న కామాక్షీదేవిగా, 5న ఆదిపరాశక్తి, 6న మహాలక్ష్మి, 7న మావడిసేవ, 8న శ్రీఅన్నపూర్ణాదేవి, 9న దుర్గాదేవి, 10న మహిషాసుర మర్దిని, 11న సరస్వతీదేవి, 12న శివపార్వతుల అలంకారంలో భక్తులను కటాక్షించనున్నారు. చివరిరోజు 12వ తేదీన పార్వేట ఉత్సవం జరిపించనున్నారు.

మహిళల ప్రతిభకు ఆకాశమే హద్దు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : మహిళల ప్రతిభకు ఆకాశమే హద్దని, పురుషులతో పోటీపడి వివిధ రంగాల్లో రాణిస్తున్నారని ఎస్వీయూ సీడీసీ డీన్ ప్రొఫెసర్ చంద్రానాయుడు తెలిపారు. శుక్రవారం శ్రీపద్మావతి డిగ్రీ, పీజీ కళాశాలలో నూతన విద్యార్థి సంఘం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చంద్రానాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ విలువైనదని, సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సూచించారు. టీటీడీ డీఈఓ డాక్టర్ వై.నాగరాజు నాయుడు మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పట్టుదలగా తాము ఎంపిక చేసుకున్న లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. సమస్య ఎదురైనప్పుడు లోలోపల బాధపడకుండా గురువులను సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. నిరంతర శ్రమతో తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన వారిని విద్యార్థి సంఘ సభ్యులుగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. సంఘం అధ్యక్షురాలిగా ఎంపికైన పి.సోనీ, ఇతర సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జి డాక్టర్ బి.జ్యోతి, డాక్టర్ భద్రమణి, డాక్టర్ సి.భువనేశ్వరీదేవి, మ్యూజిక్ కాలేజీ ప్రిన్సిపల్ ఉమ మధుబాల, అధ్యాపకులు విద్యుల్లత, హేమలత, ఉమాదేవి, జయశ్రీ, వై.శిరీష, సాయికుమారి, నాగపద్మ, లక్ష్మి, సుహాసిని, కస్తూరి, శోభ, ప్రవీణ, వరప్రసూన పాల్గొన్నారు.

శిక్షణకు పేర్లు నమోదు చేసుకోండి

శ్రీకాళహస్తి: యువ ఆపద మిత్ర శిక్షణకు ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సహకారంతో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో యువ ఆపదమిత్ర అనే పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చి, రూ.10 వేలు విలువైన అత్యవసర పరికరాల కిట్లు ఉచితంగా అందజేస్తారన్నారు. అలాగే 3 సంవత్సరాల లైఫ్ అండ్ హెల్త్ ఇన్సూరెన్సు కూడా చేస్తారన్నారు. భారత్ స్కౌట్స్‌అండ్ గైడ్స్(ఎన్‌సీసీ)లో శిక్షణ పొందిన 18-40 సంవత్సరాలలోపు రోవర్లు, రేంజర్లు ఇందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963981617 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పల్లికొండేశ్వరాలయ ఈఓగా లత



లత

నాగలాపురం: మండల కేంద్రంలోని సురుటుపల్లి గ్రామంలో వెలసిన సుప్రసిద్ధ శ్రీసర్వ మంగళ సమేత శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయ ఈఓగా లత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పిచ్చాటూరు మండలంలోని రామగిరి గ్రామంలోని శ్రీకాలభైరవ స్వామి ఆలయంలో పని చేశారు. దేవదాయ శాఖ ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు శ్రీపల్లికొండేశ్వర స్వామి దేవస్థానానికి ఈఓగా ప్రభుత్వం నియమించడంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శన ఏర్పాట్లు కల్పించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



నెల్లటూరు అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీఓ రెడ్డి దేవకుమారి

వరదయ్యపాళెం: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సత్యవేడు ప్రాజెక్ట్ సీడీపీఓ రెడ్డి దేవకుమారి పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం నెల్లటూరులో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



ఊంజల్‌సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ అమ్మవాకి శుక్రవారం సాయంత్రం ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరిచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలు చేశారు. ఉదయం 7 గంటలకు వేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలు జరిపారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు నిర్వహించిన అనంతరం పద్మావతీ అమ్మవారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలోకి వేంచేపు చేశారు. అనంతరం ఊంజల్‌సేవలో కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయాధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నారాయణవనంలో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నారాయణవనం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన నారాయణవనంలో సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి, దోమల వృద్ధిని అడ్డుకోవడం, పరిసరాల పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి షణ్ముగం మాట్లాడుతూ వ్యక్తిగత పారిశుద్ధ్యానికి అందరూ ప్రాధాన్యత ఇస్తూ, చెత్తను బయట పడవేయకుండా చెత్తబుట్టల వాడకాన్ని అలవరచుకోవాలని సూచించారు. పంచాయతీలోని ప్రతి ఇంటికీ ఉచితంగా ఒక చెత్తబుట్టను అందజేశామని తెలిపారు. నారాయణవనం వీధుల్లో జరిగిన ర్యాలీలో ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు పంచాయతీ, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానపత్రికల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని బజారువీధిలో ఉన్న శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ముందుగా అమ్మవారి పాదాల చెంత ఉంచి, పూజలు నిర్వహించారు. అనంతరం వాటిని ఆర్యవైశ్యులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.



ఆహ్వానపత్రికలు అవిష్కరిస్తున్న ఆర్యవైశ్యులు

సీపీఎం మహాసభల రేణిగుంట కార్యదర్శిగా ఈశ్వరమ్మ



సమావేశంలో పాల్గొన్న సీపీఎం నేతలు

రేణిగుంట: సీపీఎం మహాసభల రేణిగుంట పట్టణ శాఖ కార్యదర్శిగా స్థానిక సీపీఎం నాయకురాలు కె.ఈశ్వరమ్మను ఆ పార్టీ నాయకులు ఎన్నుకున్నారు. రేణిగుంట సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షతన సమావేశం నిర్వహించి తొలుత పార్టీ జెండా ఆవిష్కరించి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నవంబర్‌లో సత్యవేడులో జరగనున్న జిల్లా మహాసభలకు మండలం నుంచి కె.ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి ప్రతినిధులుగా పాల్గొంటారు. ఈ మేరకు మహాసభల కార్యదర్శిగా ఈశ్వరమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానం ఆమోదించారు. అలాగే ప్రత్యామ్నాయ ప్రతినిధులుగా కృష్ణ, కుప్పస్వామిని పంపాలని తీర్మానించారు. అలాగే మండలంలోని ప్రధాన సమస్యలను రాసుకుని వాటి పరిష్కారానికి చేయాల్సిన పోరాటాలను గురించి చర్చించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి హరినాథ్, ఓ.వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, ఈశ్వరమ్మ, సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో తూతూమంత్రంగా గ్రామసభ

- శ్మశానం అమ్మకంపై వామపక్షాలు నిలదీత



రేణిగుంట గ్రామ సభలో ఖాళీగా కుర్చీలు

రేణిగుంట: పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ నగేషం అధ్యక్షతన జరిగిన గ్రామసభకు జనం ముఖం చాటేశారు. పట్టణ ప్రజలు రాకపోవడంతో ముందు సీట్లలో సచివాలయ సిబ్బంది, వైద్య, ఆరోగ్య సిబ్బంది కూర్చున్నారు. సర్పంచ్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా రేణిగుంట హిందూ శ్మశాన వాటికలో మృతుల కుటుంబాలు సమాధులు నిర్మించుకోవాలంటే పంచాయతీకి రూ.లక్ష డిపాజిట్ చేయాలనే అంశం గ్రామసభ ఆమోదం కోసం అజెండాలో పెట్టిన విషయాన్ని సాక్షి దినపత్రికలో ‘అమ్మకానికి హిందూ శ్మశానవాటిక’ అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై సీపీఎం ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, ఆ పార్టీ నాయకులు వెంకటరమణ, హరినాథ్, ఈశ్వరి తదితరులు గ్రామసభ వద్దకు చేరుకుని తీర్మానం ఆమోదించకూడదని పట్టుబట్టారు. ప్రజామోదం లేని ఇలాంటి తీర్మానాలను పెట్టి అమలు పరిస్తే తాము కచ్చితంగా ప్రజల పక్షాన నిలబడి ఉద్యమాలు చేస్తామన్నారు. దీంతో పంచాయతీ అధికారులు వెనక్కి తగ్గి ఆ అంశంపై ఆమోదం లేకుండా ఎలాంటి తీర్మానం చేయమని స్పష్టం చేశారు.